నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | మార్చి 07, 2025 | www.navatelangana.com

బ్లూ కోట్ విధుల్లో మహిళా కానిస్టేబుళ్లు

నవతెలంగాణదస్తురాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారం మండల పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుళ్లుగురువారం బ్లూ కోట్, పెట్రోకార్ సేవలు అందించారు. మండలంలోని గొడిసిర్యాల ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాటికి జరిమానా విధించారు.



అనుమతి లేని రికవరీలు నిలిపేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల అనుమతి లేకుండా గుర్తింపు సంఘం తన ఇష్టానుసారం కార్మికుల ఖాతాలో నుండి 2నెలల పేరిట రూ.100 రికవరీ చేసుకోవడం సరైనది కాదని, వెంటనే ఆ డబ్బులను కార్మికులకు చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు సంతకాలు చేసినప్పుడు యాజమాన్యం నోటీసు బోర్డుపై ఉంచి కార్మికుల నుండి అభ్యంతరాలు ఉన్నాయా లేదా అని తెలుసుకోకుండా ఏకపక్షంగా కార్మికుల వేతనాల నుండి ఈ నెల కార్మిక సంఘం పేరిట రూ.100 రికవరి చేయడం చట్టబద్ధం కాదని తెలిపారు. ఇలాంటి రికవరీలు జరిగిన తీరుపై గుర్తింపు సంఘం తన వైఖరిని తెలియజేయాలని పేర్కొన్నారు.

ఈత చెట్ల తొలగింపుకు అనుమతులు జారీ



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని బెల్లంపల్లి మండలం బూదకలాన్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా ఈత చెట్ల తొలగింపు కొరకు అనుమతులు జారీ చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్‌తో కలిసి ఆబ్కారీ, మద్యనిషేధ, ఉద్యానవన, సింగరేణి, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూదకలాన్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ కొరకు సింగరేణి స్థలంలో 464 ఈత చెట్ల తొలగింపు కొరకు సంబంధిత శాఖల నుండి అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. తొలగించిన చెట్లకు బదులుగా సింగరేణి భూములలో రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటాలనే నిబంధనతో అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈత చెట్లకు సంబంధించిన నష్టపరిహారం 50 శాతం భూమి యజమాని అయిన సింగరేణి సంస్థకు, 25 శాతం గీత కార్మికుల సొసైటీకి, మిగిలిన 25 శాతం ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకవేళ సొసైటీ మనుగడలో లేనట్లయితే ఆబ్కారీ, మద్యనిషేధ శాఖకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఆబ్కారీ, మద్యనిషేధ శాఖ పర్యవేక్షకులు నందగోపాల్, జిల్లా ఉద్యానవన అధికారి అనిత, డి సెక్షన్ పర్యవేక్షకులు అరవింద్, సింగరేణి సంస్థ సీనియర్ ఎస్టేట్ అధికారి నవనీత, ఫారెస్ట్రీ మేనేజర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎస్ఈ ఆర్.నరేష్, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఎండి.ఆసిఫ్, బెల్లంపల్లి డిప్యూటీ తహసీల్దార్ కల్పన పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు అవరోధమయ్యే భూసమస్యలపై తక్షణ చర్యలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో శాంతిభద్రతలకు అవరోధంగా మారే భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం దిశగా మండల, సబ్-డివిజన్, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలోని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కమిటీ సూచనలు అనుసరించాలని తెలిపారు. సబ్-డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, ఎసిపిలు ఉంటారని, మండల స్థాయి కమిటీ పనితీరును 15 రోజులకు ఒకసారి పరిశీలిస్తారని తెలిపారు. సమస్యల పరిష్కారంలో మండల కమిటీకి తగు సూచనలు చేస్తారని, డివిజన్ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల స్థాయి కమిటీకి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. కమిటీల పనితీరు, ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కొరకు జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 08736-250106 నంబర్‌ను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం బాలాజీ అనుకొడ గ్రామంలో జునుగరి సంజీవ్ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంటిపై దాడి చేశారు. నిల్వ ఉంచిన బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించి విక్రయిస్తానని నిందితుడు చెప్పాడని డీటీ తెలిపాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు పైఅధికారులకు నివేదించామని పేర్కొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 97శాతం హాజరు

నవతెలంగాణ-నస్పూర్


ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు 97శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 5వేల433 మంది హాజరు కావాల్సి ఉండగా 5వేల299 మంది, ఒకేషనల్‌కు 638 మంది హాజరు కావాల్సి ఉండగా 615 మంది హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పరీక్షా కేంద్రాలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించామని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం మినహాయింపు

నవతెలంగాణ-జన్నారం

మండల ప్రజలు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) పరిధిలో ఫీజును మార్చి 31లోగా చెల్లిస్తే 25 శాతం మినహాయింపు పొందవచ్చని మండల పంచాయతీ అధికారి జలంధర్ తెలిపారు. ప్రజలు తమ ఆస్తులను రెగ్యులర్ చేసుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ మంచి అవకాశమన్నారు. నిర్ణీత గడువులోగా ఫీజును చెల్లించి మినహాయింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి మాటున ప్రాణాంతక వ్యాధులు



- ఇప్పడున్న థర్మల్ ప్లాంట్లకు తోడు మరో 2400 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు
- విద్యుదుత్పత్తికి బొగ్గు మండించి అగ్గి కురిపించాలి
- ఎస్టీపీపీలో మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి
- పెరుగుతున్న భూతాపం
- నియంత్రణకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలు అవసరం

పారిశ్రామిక అభివృద్ధి మాటున ప్రాణాంతక వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకమైనా కాలుష్య నియంత్రణ కూడా అత్యవసరం. పాలకులు విద్యుదుత్పత్తికి ప్రాధాన్యత నివ్వడం ఆహ్వానించదగిందే కానీ పర్యవసనాలను కూడా అదే స్థాయిలో పరిగణలోకి తీసుకోవాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమల పేరుతో సామాన్యుల ప్రాణాలను ఫణంగా పెట్టడం సరికాదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచిర్యాల పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పుడున్న థర్మల్ విద్యుత్ ప్లాంట్లను విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ కాలుష్యం మరింతగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ-జైపూర్

రామగుండంలో ఎన్టీపీసీ సూపర్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ విస్తరణలో భాగంగా మరో 2400 మెగావాట్ల థర్మల్ ప్లాంటు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఫలితంగా ఇటీవల గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ వేదిక ద్వారా స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల వారు 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఇదిలా ఉంటే గోదావరి నదికి ఇవతలి వైపు జైపూర్ మండలంలో ఇప్పటికే 600 మెగావాట్ల రెండు విద్యుత్ యూనిట్ల ద్వారా 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లను సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసింది. దీనికి తోడు మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు వైపు అడుగులు వేస్తోంది. 13కిలో మీటర్ల పరిధిలో గోదావరి నదికి ఇరు వైపులా థర్మల్ విద్యుత్ ప్లాంట్లు విస్తరిస్తుండటం స్థానిక ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. పారిశ్రామిక అభివృద్ధి మాటున ప్రాణాంతక వ్యాధులు పొంచి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు తోడు భూగర్భ, ఉపరితల బొగ్గు గనులు

ఓ వైపు థర్మల్ ప్లాంట్ల విస్తరణ మరో వైపు ఎరువుల కర్మాగారం, భూగర్భ, ఓపెన్‌కాస్టు గనులు విస్తరించి ఉన్నాయి. ఫలితంగా పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. దీంతో మానవ మనుగడకు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందన్న అభిప్రాయ వ్యక్తమవుతోంది. రామగుండం సూపర్ థర్మల్ పవర్‌ప్లాంట్ రెండో దశ విస్తరణ పేరుతో మరో 2400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం స్థానికులతో పాటు పర్యావరణ, గోదావరి పరిరక్షణ, సిటీజన్ వెల్ఫేర్, మానవహక్కుల వేదిక అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. రామగుండం ఏరియాలో గతంలో ఏర్పాటు చేసిన 65.2మెగావాట్ల జెన్‌కో విద్యుత్ ప్లాంట్ అనంతరం ఏర్పాటు చేసిన 2600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ యూనిట్‌కు తోడు 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ యూనిట్లు ఇదివరకే ఏర్పాటు చేశారు. ఫలితంగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రామగుండంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతుండడంతో స్థానికులు అభ్యంతం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అతీ సమీపంలో జైపూర్ మండలంలో 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటైంది. అనుసంధానంగా మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభం కాబోతోంది. రానున్న రోజుల్లో 2000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలన్న సంకల్పంతో యాజమాన్యం ముందుకు సాగుతోంది.

థర్మల్ విద్యుత్ ప్లాంట్లతో బొగ్గును మండించి అగ్గిని కురిపించడమే..

రామగుండంలో ఇప్పుడున్న థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు తోడు మరో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయించుకోవడం, సమీపంలో 1200 సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు తోడు మరో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు ఇవన్నీ చూస్తుంటే విద్యుత్ ఉత్పత్తి సాధించడం కోసం బొగ్గును మండించి అగ్గి కురిపించనున్నారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు తోడు భూగర్భ బొగ్గు గనులు, ఉపరితల బొగ్గు గనులతో ఇప్పటికే అగ్గి కురుస్తుండగా వాయు, జల, పర్యావరణం కలుషితమై ఊపిరి తీసి ఊపిరి పీల్చుకోడమే కష్టంగా మారిందని ఇటీవల నిర్వహించిన ప్రజావేదికలో వక్తలు వెల్లడించారు. భూగర్భ గనులు, ఉపరితల గనులు, రసాయన ఎరువుల కర్మాగారం, థర్మల్ విద్యుత్ ప్లాంట్లతో గోదావరి జలం కలుషితమై ఈ ప్రాంతంలో పంటల దిగుబడి కూడా పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామగుండం నుండి కేవలం 13కిలో మీటర్ల పరిధిలో ఇప్పుడున్న 5400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లకు తోడు మరో 4800 మెగావాట్ల విస్తరణ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మొత్తంగా 10,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి ఎన్టీపీసీ సహా ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రస్తుతం ఉన్న థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ఏడాదికి సుమారుగా 40 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గును మండిస్తున్నారు. మరో 28 మెట్రిక్ టన్నుల బొగ్గును మండిస్తే తప్ప ప్రతిపాదిత విస్తరణ థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తిని సాధించలేమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా రామగుండంలో ఇదివరకే 3డిగ్రీల ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుండగా ప్రతిపాదిత విస్తరణ ప్లాంట్ ద్వారా ఇక్కడి ఉష్ణోగ్రతలు 5 నుండి 6 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే కేంద్రాల్లో రామగుండం ఒకటి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి రామగుండంలో ఉష్ణోగ్రతలు ఇతర ప్రాంతాలకంటే ఎక్కువగా నమోదవుతాయి. గతంలో భూగర్భ గనులు మాత్రమే ఉండేవి. పది సంవత్సరాల నుండి ఉపరితల బొగ్గు గనులు పెరుగుతున్నాయి. ఎరువుల కర్మాగారం, సిమెంట్ పరిశ్రమలు ఇక్కడి ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికి శ్రీరాంపూర్, మందమర్రి, బెలంపల్లి, గోలేటి తదితర ప్రాంతాల్లో భూగర్భ, ఉపరితల గనులు తోడై ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమవుతున్నాయి. జైపూర్‌లో సింగరేణి యాజమాన్యం విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పట్నుండి పరిసర ప్రాంతంలో గతంతో పోల్చితే ఉష్ణోగ్రతలు పెరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ ప్లాంట్‌కు అతి సమీపంలో ఒక వైపు శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్ ఉపరితల, భూగర్భ గనులు ఉన్నాయి. ఇందారం, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనుల మధ్య రామారావుపేట్ గ్రామం చిక్కుకుంది. ఓసీ పేలుళ్లతో ఇంటి గోడలు బీటలు వారుతున్నాయి. ధ్వని, వాయు, వాతావరణ కాలుష్యంతో గ్రామస్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాణాలకు హాని తలపెట్టకుండా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నియంత్రించడం కోసం సుస్థిరాభివృద్ధికి పాటుపడే విధంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలు అవరమని పాలకులు, అధికారులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

శాంతిఖని విస్తరణ సరికాదు

- ప్రజాభిప్రాయ సేకరణలో కంటతడి పెట్టిన రైతులు
- అభిప్రాయ సేకరణ ఆవరణలో రైతుల శాంతియుత ర్యాలీ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలోని శాంతిఖని ప్రాజెక్టు విస్తరణ సరికాదని స్థానికులు అభిప్రాయపడ్డారు. గురువారం పాత శాంతిఖని గని వద్ద ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. అభిప్రాయ సేకరణలో నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి లక్ష్మణ్ ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, మందమర్రి జీఎం దేవేందర్ పాల్గొన్నారు. అభిప్రాయ సేకరణలో ప్రభావిత గ్రామాలైన పెరుకపల్లి, ఆకనపల్లి, బెట్యాన్‌పల్లి, లింగాపూర్ గ్రామస్తుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రజాభిప్రాయ సేకరణ సమావేశానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు శాంతిఖని విస్తరణకు వ్యతిరేకంగా గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. బొగ్గు బావులు వద్దు వ్యవసాయం ముద్దు అంటూ సమావేశ స్థలంలో నినాదాలు చేశారు. భూగర్భ జలాలు ఇంకిపోయి బోరు బావులు వట్టిపోతున్నాయని, పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ గని వల్ల వాతావరణంలో పెను మార్పులు సంభవించి వ్యవసాయంపై ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పంటలు, కూరగాయలు పండ్లతోటల సాగు, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. శాంతిఖని విస్తరణ ప్రకటనతో భూముల ధరలు పడిపోయాయని వాపోయారు. పచ్చని పంటలు పండే పరిసరాల్లో పారిశ్రామికరణ పేరుతో బొందలు తోడుడు ఎందుకని, వ్యవసాయానికి అనువుగా లేని అటవీ ప్రాంతాల్లో బొగ్గు బావుల విస్తరణ జరగాలని ప్రజలు ముక్తకంఠంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సింగరేణిలో యాంత్రీకరణ వల్ల ఉద్యోగ ఉపాధి, అవకాశాలు తక్కువయ్యాయని స్థానిక ప్రజలకు ఏమాత్రమూ ప్రయోజనం లేని పారిశ్రామికరణ తమకెందుకని వ్యతిరేకించారు. సింగరేణిలో యాంత్రికరణతో ఉద్యోగాలు లభించే పరిస్థితులు లేవన్నారు. సహజ వనరులను కొల్లగొట్టి కోట్లాది రూపాయలను అర్జిస్తున్న సింగరేణి ప్రాభావిత గ్రామాలపై చిన్నచూపు చూస్తోందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నియమాలను పాటించడం లేదని వాపోయారు.

పోలీసుల భారీ బందోబస్తు

శాంతిఖని పబ్లిక్ హియరింగ్ వద్ద గురువారం పోలీసులను భారీగా మోహరించారు. అక్కడికి లాంగ్ వాల్ ప్రాజెక్టు బాధిత గ్రామాల రైతులు, ప్రజలు వచ్చి గొడవ చేస్తారని ముందస్తుగానే సింగరేణి యాజమాన్యం గని ఆవరణలో కనుచూపు మేరకు పోలీసు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో బెల్లంపల్లి, జైపూర్ సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పబ్లిక్ హియరింగ్ సమావేశం సాగింది. సమావేశం ముఖద్వారం వద్దనే మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టును వ్యతిరేకించే రైతులు, స్థానికేతరులెవరినీ లోనికి అనుమతించలేదు. కట్టుదిట్టమైన సాయుధ పోలీసు బలగాల మోహరింపు మధ్య పబ్లిక్ హియరింగ్ ఉత్కంఠతో జరిగింది. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో శాంతి గని మేనేజర్ విజయ్ కుమార్ సిన్హా, ఏజెంటు అబ్దుల్ ఖాదర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



పోలీసుల బందోబస్తు

భవిష్యత్తుపై ఆందోళనగా ఉంది : సబ్బని ముక్తేష్



మాట్లాడుతూ కంటతడి పెట్టిన రైతు సబ్బని ముక్తేష్

శాంతిఖని అండర్ గ్రౌండ్ మైనింగ్ వల్ల ప్రాభావిత గ్రామాల భవిష్యత్తుపై ఆందోళనగా ఉందని ఉత్తమ రైతు సబ్బని ముక్తేష్ కంటతడి పెట్టారు. ఇప్పటి వరకు నాలుగు బోర్లు వేశానని, చుక్కనీరు రావడం లేదని తెలిపారు. భూమిలో తేమశాతం తగ్గడం వల్ల పంట దిగుబడుల్లో భారీ వ్యత్యాసం వచ్చి నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూరగాయల పంటలు పండించి బెల్లంపెల్లి పరిసర ప్రాంత అవసరాలు తీర్చానని తెలిపారు. శాంతిఖని బొగ్గు బాయి వల్ల బోరు బావుల్లో నీరు ఇంకిపోయి వ్యవసాయం సంక్షోభంలో పడిందని తెలిపారు. భవిష్యత్తులో శాంతిఖని ప్రభావిత ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడి పంటలు పండక కరువు ప్రాంతంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శాంతిఖని విస్తరణ ఉపసంహరించుకోవాలి : కారుకూరి రామచందర్, మాజీ మార్కెట్ చైర్మన్

శాంతిఖని విస్తరణను సింగరేణి యాజమాన్యం ఉపసంహరించుకోవాలి. బంజరు, బీడు భూములు, అటవీ ప్రాంతాలలో మైనింగ్ జరగాలి. అధిక జనసాంద్రత గల ప్రాంతాలలో పారిశ్రామికరణను విస్తరించి పచ్చని పంట పొలాలను, సారవంతమైన భూములను కొల్లగొట్టరాదు. సింగరేణి యాజమాన్యం సోలార్ ఉత్పాదకత వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తి మార్గాలను ఎంచుకొని లాభాలను అర్జించాలి. మాదారం పరిధిలోని మహావీర ఖని జనావాసాలు లేని ప్రాంతాలలో పాత గనులను పునరుద్ధరించాలి. ప్రజా అభిప్రాయాలకు వ్యతిరేకంగా శాంతిఖని విస్తరణ జరిగితే తీవ్రమైన ఆందోళనలు చేస్తాం.

రెమ్యునరేషన్ ఇవ్వాలి

నవతెలంగాణ-తలమడుగు

ఎన్నికల విధులు, సమగ్ర కుటుంబ సర్వే నిర్వర్తించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌తో పాటు హజరు పట్టిక సర్టిఫికెట్ ఇవ్వాలని గురువారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన, సమగ్ర కుటుంబ సర్వే మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు



16 రోజులు సర్వేలో పాల్గొన్నారు. ఎలాంటి ఆటంకం లేకుండా విధులు నిర్వర్తించారు. కాని వాటికి సంబంధించిన రెమ్యునరేషన్, హజరు సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదన్నారు. వెంటనే వాటిని అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, మురళీధర్, రవీందర్ కుమార్, కృష్ణ చైతన్య ఉన్నారు.

పెట్రోలింగ్ కారు విధుల్లో మహిళ పోలీసులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మహిళ పోలీసులు అన్ని రకాల విధులు నిర్వర్తిస్తున్నారని అందులో భాగంగానే పెట్రోలింగ్ విధులు సైతం నిర్వర్తిస్తున్నామని నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్ రిసెప్షనిస్ లక్ష్మీ, రైటర్ మమత అన్నారు. గురువారం పెట్రోలింగ్‌లో భాగంగా కారులో వెళ్లి విధులు నిర్వర్తించారు. మహిళ పోలీసులు ఇలాంటి అవకాశం కల్పించిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.



కామర్స్ కళాశాల అడ్మిషన్ క్యాంపెనింగ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల సిబ్బంది తమ కళాశాలలో చేరాలని అడ్మిషన్ క్యాంపెనింగ్ నిర్వహించారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో గుడిహత్నూర్, ఇచ్చోడలోని పరీక్ష కేంద్రాల్లో క్యాంపెనింగ్ చేశారు. తమ కళాశాల వసతులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన జరుగుతుందని అన్నారు. విద్యతో పాటు ఆటపాటల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, కోటయ్య, ముబారక్, నరేష్, గోపాల్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుము మార్చి 31లోపు చెల్లించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపులు, ఇతర అంశాలపై గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎల్టీపీఎస్ ఇంజనీర్స్, రియల్ ఎస్టేట్ డెవలపర్స్, దస్తావేజు లేఖరులతో సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ, అందులోని సమస్యలు ఇబ్బందులను పలువురు కలెక్టర్‌కు వివరించారు. వాటి పరిష్కార మార్గాలను కలెక్టర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఎల్డీఆర్ఎస్ తీసుకువచ్చిందన్నారు. 20 ఆగస్టు 2020 వరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజును నిర్ణయించి మేసేజ్ రూపంలో పంపించడం జరిగిందన్నారు. మార్చి 31లోపు చెల్లిస్తే రాయితీ కూడా ఉంటుందన్నారు. లేఅవుట్లో కనీసం 10 శాతం రిజిస్ట్రేషన్ చేసి ఉన్న కూడా ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పట్టణ పరిధిలో 4 వేలు, గ్రామీణ ప్రాంతంలో 3 వేల వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. పట్టణ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్, గ్రామీణ ప్రాంతానికి అదనపు కలెక్టర్ వేరిఫికేషన్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దరఖాస్తు దారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీపీఆర్ఓ తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన గురవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భీమ్‌నగర్‌కు చెందిన జల్పట్ వినోద్(30) ఏపీ 01 ఎక్స్ 6057 నెంబర్ గల ట్రాక్టర్‌లో అటవీశాఖ నర్సరీ మొక్కలను దస్నాపూర్ గ్రామానికి తీసుకు వెళ్తుండగా హర్కపూర్ గ్రామ శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ పక్కన కూర్చున్న జల్పట్ వినోద్ మీద ట్రాలీ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జల్పట్ పూలాజి డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన భగత్ సంతోష్(36) ఆటో డ్రైవర్ అప్పుల బాధతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... జాతర్ల గ్రామానికి చెందిన భగత్ సంతోష్‌కు రూ.4లక్షల వరకు ప్రయివేట్ అప్పులు ఉండటంతో మనస్తాపానికి గురై, గ్రామ సమీపంలో పంట పొలాల్లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటు వైపుగా వెళ్లిన రైతులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. భార్య భగత్ రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమాచార హక్కు చట్టం దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ మున్సిపాలిటీకి వస్తున్న సమాచార హక్కు చట్టం దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు సయ్యద్ హైదర్, జిల్లా అధ్యక్షులు వినోద్ మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టంపై అధికారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. పరీక్ష సమయం కంటే విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది, పోలీసులు బాలబాలికలను వేరువేరుగా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. తొలి పరీక్షకు 9 వేల 114 మంది విద్యార్థులకు గాను 8 వేల 720 మంది హాజరు కాగా 394 మంది గైర్హాజరైనట్టు డీఐఈఓ జాదవ్ గణేష్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

అస్వస్థతకు గురైన విద్యార్థి...

జిల్లా కేంద్రంలోని సాత్నాల బస్టాండ్ వద్ద ఉన్న బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. పరీక్ష రాస్తున్న క్రమంలో విద్యార్థి బాపూరావ్ బీపీ తగ్గి, అస్తమా కాళ్లు తిమ్మిరెక్కి పడిపోవాడాన్ని గమనించిన ఇన్విజిలేటర్ వెంటనే అక్కడ ఉన్న ఏఎన్ఎంతో ప్రథమ చికిత్స అందించి, 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి బాగుందని వైద్యులు చెబుతున్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థి బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఉట్నూర్ : ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉట్నూర్ మండల కేంద్రంలో పకడ్బందీగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి, విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించారు. గంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థుల హాల్ టికెట్‌లను పరిశీలించి, లోపలికి అనుమతించారు.

ఉత్తమ అవార్డు అందుకున్న మోహన్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో ప్రతిభ కనబర్చిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జాతీయ స్థాయి అవార్డు జిల్లాకు దక్కడం ఇదే ప్రథమం. గిరిజన గాయకుడు పవార్ మోహన్ నాయక్ 25 సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఏండ్లుగా ప్రభుత్వ కార్యక్రమాలు, గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై, ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్నో అవార్డులు పొంది గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లా ఉత్తమ గాయకుడుగా అవార్డులు అందుకున్నారు. ఢిల్లీ కేంద్రంలో జరిగిన సేవాలాల్ జయంతి కార్యక్రమంలో జాతీయ స్థాయి అవార్డును పొందారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ కుష్బు గుప్త మోహన్ నాయక్‌ను అభినందించారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-తలమడుగు

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఉమ్రి గ్రామస్తులు గురువారం ఎంపీ గోడం నగేష్‌ను కోరారు. ముందుగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. సమస్యలు విన్న ఎంపీ సమస్యలను విడుతల వారిగా పరిష్కరిస్తానని అన్నారు. ఎంపీని కలిసిన వారిలో జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, గ్రామ మహాజన్, పెందూర్ మాధవరావు పటేల్, కుమ్ర రామారావు, కాంతారావు, విలాస్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి, రజినీకాంత్, కృష్ణ, దేవన్న అశోక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

నీట్ కోసం పరీక్ష కేంద్రాలను గుర్తించాలి : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మే 4న జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో పరీక్షా కేంద్రాలను గుర్తించి రిపోర్ట్ అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మే4న జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ యూజీ-2025 పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ అర్హత పరీక్ష కోసం పరీక్ష కేంద్రాలను జిల్లాలోని కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్కూల్స్, ఆర్మీ స్కూల్స్, ఇంజనీరింగ్ కళాశాలలు, సీబీఎస్ఈ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి, అందులో ఉన్నంటువంటి మౌలిక వసతులు, చేపట్టాల్సిన చర్యలపై తక్షణమే నివేదిక అందించాలని ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాల ఎంపికకు నియమ నిబంధనల ప్రకారం అందులో ఉండాల్సిన మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. జిల్లాలో అభ్యర్థులు పరీక్ష రాసే వీలున్నందున పరీక్ష నిర్వహణ రోజున అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పరీక్ష రాసేందుకు వీలుగా బెంచీలు, కుర్చీలు, తాగునీరు, మూత్రశాలలు, సీసీ కెమెరాల పనితీరు, తరగతి గదులు, లైటింగ్, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, తదితర సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై నివేదిక అందించాలని, నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గదికి 24 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా గదులు ఉండాలని అన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీఓ వినోద్ కుమార్, డీఈఓ ప్రణీత, డీఐఈఓ గణేష్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



నీట్ పరీక్ష కేంద్రాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీవశాస్త్ర ఫోరం ఆదిలాబాద్ తరపున ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపిక కాబడిన జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా నియామకమైన వారికి తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫారం ఆదిలాబాద్ తరపున ఘనంగా సన్మానించారు. గురువారం పట్టణంలో వారిని సన్మానించి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు వారి సేవలను విద్యార్థులకు అనేక నైపుణ్యాలతో అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాఘవేందర్, పోచ్చారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెరుగు సుధాకర్, సీనియర్ ఉపాధ్యాయులు రవీందర్, సుచరిత, రిసోర్స్ పర్సన్స్ సంతోష్ పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కంది సాయిమౌనారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఓంశాంతి నిలయంలో మహారాష్ట్రలోని ఆచార్య వినోభాబావే గ్రామీణ ఆస్పత్రి వార్ధ వైద్య బృందం సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యాంపును సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైనవారు ఉచితంగా మందులు తీసుకెళ్లాలని సూచించారు. వైద్యులు దేవుళ్లతో సమానమని, ప్రతిఒక్కరి జీవితంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అదేవిధంగా మానసిక ఒత్తిళ్ల నుండి బయటపడేందుకు ఓంశాంతి నిలయం ఒక దివ్య క్షేత్రమని ఇక్కడకు వచ్చి ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేణుకా బహెన్, ఓంశాంతి సభ్యులు, శ్రీలేఖ, లతా టీచర్, దేశెట్టి ప్రభావతి, సోనియా మంథని, ఖయ్యూం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖానాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో టవర్ లైన్ పనుల కారణంగా ఈనెల 8న శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సదానందం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని అశోక్ రోడ్, ఖానాపూర్, సోనార్ గల్లి, బొక్కలగూడ, కోలిపుర, మసూద్‌చౌక్ , దంగర్ గల్లి, శాంతినగర్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ సంబరాలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డి గెలిపొందడంతో బీజేపీ నాయకులు టపాకాయలు పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా బీజేపీ పార్టీ వైపు చూస్తున్నారని దానికి నిదర్శనమే ఎమ్మెల్సీ ఫలితాలు అని అన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో సైతం బీజేపీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసిన ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ పార్టీ అద్యకులు కాల్వ నరేష్, నాయకులు కరిపే విలాస్, శ్రవణ్ కుమార్, చెన్న రాజేశ్వర్, సాహెబ్ రావు, సామల వీరయ్య, కోరిపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, ఎల్లన్న, కరుణ, సాగర్‌రెడ్డి, పతాని నర్సయ్య, నారాయణ, తిరుమల చారి, భీమలింగం, డ్రా.శివరామ్, రంజిత్, మహేందర్, గోకుల్, రూప్ సింగ్, శివాకర్, మధు, కరణ్ సింగ్, శేఖర్, గంగాధర్, మహేష్ రెడ్డి, నవీన్, నర్సయ్య, మచ్చేందర్, గంగారెడ్డి, నర్సయ్య, భూమేష్, దయాకర్‌రెడ్డి, సంతోష్, ప్రకాష్, జాదవ్ వినోద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్ : కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయాన్ని కైవసం చేసుకున్న బీజేపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపొందడంతో గురువారం బీజేపీ నాయకులు ఉట్నూర్ పట్టణంలోని ఐబీ వద్ద టపాకాయలు, పేల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, బానోత్ జగన్, బింగి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సాడిగె గంగన్న, మాజీ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ ఎంపీటీసీ సల్లగ్ రవీందర్, కుటికెల ఆశన్న, శ్రీపతి లింగాగౌడ్, సాడిగె రాజేశ్వర్, కందుకూరి రమేష్, కాల్వ రవి, నాగభూషన్, పవర్ దేవిదాస్, చంద్రశేఖర్, ఉష్కెమొళ్ల దేవీదాస్, గాలి శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడంతో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కష్టపడిన ప్రతీ ఒక కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ఈ గెలుపు కార్యకర్తల గెలుపని అన్నారు. బీజేపీకి ఓటేసిన మేధావులకు, ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, పట్టణాధ్యక్షులు సుంకరి సాయి, నాయకులు పద్మాకర్, నవీన్, నరేందర్, శంకర్, గిల్లి విజయ్, రాజేష్, మార గంగారెడ్డి, నరేంద్రచారి, నరేష్, భరత్, విజయ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్నూర్ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొమురయ్య, అంజిరెడ్డి విజయం సాధించడంతో గురువారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణి చేశారు. బీజేపీ మండలాధ్యక్షులు భిక్కు రాథోడ్ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి నాయక్, ప్రకాష్ చాటుర్కర్, తొడసం బండు, భిక్కు రాథోడ్, మహేందర్ చౌహన్, తెలంగ్‌రావ్, రాంనివాస్, గజేందర్, కార్యకర్తలు ఉన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందడంతో టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండలాధ్యకులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం బీజేపీ నాయకులు బోయర్ విజయ్, నాయకులు రాందాస్, కాళ్ల మోహన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు రాకేష్‌రెడ్డి, అశోక్, రమేష్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



సారంగాపూర్ : ఎమ్మెల్సీ గెలుపుతో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ప్రమాదవశాత్తు ఫిల్లర్‌పై పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న పెనుగంగ ఫిల్లర్‌పై ప్రమాదవశాత్తు పడి ప్రశాంత్(31) మృతి చెందినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం-12 నంబర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రకు వెళ్లి వ్యాపారం చేసుకునేవాడు. ఈ క్రమంలో ఈనెల 5న మధ్యాహ్నం ఇంటి నుండి వ్యాపార నిమిత్తం మహారాష్ట్రలోని దాబా గ్రామానికి వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నారు. పొడసా గ్రామం సరిహద్దులో ఉన్న పెనుగంగ ఉన్న పిల్లర్‌పై ప్రమాదవశత్తుపడి మృతి చెందినట్లు ఒక వ్యక్తి సోషల్ మీడియాలో ఫోటోలు తీసి పంపించాడు. గురువారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి అన్న ప్రమోద్ చేరుకొని గుర్తించారు. కాగా మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతుని అన్న ప్రమోత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఉదయం గంట ముందే ఆయా కేంద్రాలకు విద్యార్థులు చేరుకొని తమ హాల్ టికెట్ నంబర్లను చూసి రూంలోకి వేళ్లారు. ముందుగా పోలీసులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. గురువారం తొలి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4984 మందిలో జనరల్ 4248, ఒకేషనల్ 736 మంది హాజరు కావాల్సి ఉండగా... జనరల్‌లో 4148, ఒకేషనల్‌లో 707 మంది హాజరై జనరల్‌లో 100, ఒకేషనల్‌లో 23 మంది మొత్తం 123 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ తెలిపారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు నిర్వహించారు.

ప్రజా సంఘాల పోరాటం.. స్పందించిన అధికారులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాంకిడి మండలంలోని ఎంకోలి కొలంగూడ గిరిజన గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాలని ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఖాళీ బిందెలతో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన అధికారులు గురువారం గ్రామానికి తాగునీటి ట్యాంకర్‌ను పంపించి గ్రామస్తులకు నీటిని అందించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి కలెక్టరేట్ చుట్టూ తిరగడంతో పాటు ఉన్నతధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోవడంతో నిరసన తెలిపినట్లు వివరించారు. నిరసనలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా తాగునీటి ట్యాంకర్ పంపించడం సంతోషంగా ఉందని, అయితే శాశ్వత పరిష్కారం కోసం అధికారులు ఇచ్చిన 15 రోజుల గడువులోగా సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏది ఏమైనా ప్రజా సంఘాలు చేసిన పోరాటంతో అధికారులు స్పందించడం తాగునీటి సమస్య తాత్కాలికంగా పరిష్కరించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రపతి భవన్‌కు కనక రాజు గుస్సాడి బృందం

నవతెలంగాణ-జైనూర్

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమృత్ మహా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల ఆరు నుండి తొమ్మిదో తేదీ వరకు రాష్ట్రపతి భవనంలో నిర్వహించే వేడుకలకు కనక రాజు గుస్సాడీ బృందానికి అవకాశం దక్కింది. రాష్ట్రపతి భవనంలో గుస్సాడీ నృత్యాల ప్రదర్శన ఇవ్వడానికి జైనూర్, సిర్పూర్(యు) మండలాల నుండి గిరిజన యువకులు బయలుదేరారు. జాతీయస్థాయిలో రాష్ట్రపతి భవనంలో నిర్వహించే వేడుకలకు ఇంత గొప్ప అవకాశం కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర భాషా సాంస్కృతిక సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణకు కనక రాజు గుస్సాడీ బృందం మాస్టర్ కనక సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయస్థాయిలో ఇలాంటి అవకాశం గిరిజనులకు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి కనక రాజు బృందం సభ్యులు హన్మంతు, ఉయిక చందు, మడావి సోమేష్, కేశవ్, సోయం కేశవ్, రమేష్, గోపాల్, అర్జున్, ప్రసాద్, తెలంగ్ రావు తదితర కళాకారులు తరలివెళ్లారు.

ఉత్సాహం నింపి..ఉత్పత్తి సాధించి



నవతెలంగాణ-రెబ్బెన

ఉత్పత్తి లక్ష్యాల దిశగా ప్రతి ఉద్యోగి తన వంతు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం ఖైరిగూడ ఉపరితల గనిని సందర్శించారు. కార్మికులను ఉత్సాహపరిచే కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి మాసంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి శావెల్, డంపర్ ఆపరేటర్స్‌తో పాటు ఇతర ఉద్యోగులకు మొత్తం 13 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఖైర్‌గూడ ఉపరితల గని నుంచి సమస్త నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రతి ఉద్యోగి తన వంతు కృషి చేయాలన్నారు. అదేవిధంగా 100శాతం ఉత్పత్తి సాధించి కార్మికులు అందరూ కూడా ప్రత్యేక ప్రోత్సాహక పథకానికి అర్హత సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి జయశంకర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ బి.వీరన్న, సేఫ్టీ ఆఫీసర్ ఏ.నారాయణ, డీవైపీఎం వేణు, ఏఐటీయూసీ నాయకులు దివాకర్, ఓదేలు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో గురువారం సీఐ ముత్యం రమేష్ ఎస్సై మధుకర్‌తో పాటు మాజీ జడ్పీ చైర్మన్ సిడం గణపతి మాజీ ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్యతో కలిసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా క్రీడల్లో మొత్తం పది ఫ్రాంచైజీలు క్రీడా కారులను గతంలో వేలం పాటలో ఎంపిక చేసుకోగా క్రీడల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.లక్ష కాగా రెండవ బహుమతి రూ.యాభై వేలు నగదును అందించనున్నారు. ఈ టోర్నీ నియోజకవర్గంలోనే మొదటిది కావడంతో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో తిలకించడానికి వస్తున్నారు. ఈ క్రీడను తిలకించడానికి వచ్చే అభిమానులకు నీడతో పాటు చల్లని నీల్లు అందించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మొదటి బహుమతి రూ.లక్ష కావడంతో గట్టి పోటీ ఉండనుంది.

బాలికలను చదవనిద్దాం.. ఎదగనిద్దాం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికలను చదవనిద్దామని ఉన్నత స్థాయికి ఎదగనిద్దామని బాలికలు కూడా ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మండలంలోని బాబాపూర్ మహాత్మ జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన బేటి బచావో- భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను బ్రతికించుకుందామని, వారిని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలన్నారు. విద్యార్థినులు యుక్త వయసులో వచ్చే సమయంలో మరింత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, శరీరం ధృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాలలో రాణిస్తారని అన్నారు. బాలికలను కాపాడుకోవడం వారిని చదివించుకోవడంతో పాటు స్వేచ్ఛగా అన్ని రంగాలలో రాణించే విధంగా కృషి చేయాలన్నారు. భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 40 ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలో ప్రత్యేక బృందం ద్వారా ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలు నిరోధించే దిశగా ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలని తెలిపారు. బాలికల చదువు కుటుంబంతో పాటు దేశాభివృద్ధికి ముందడుగుని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, మాస్టర్ ట్రైనర్లు రాజేష్, సుందిళ్ల రమేష్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతిస్తున్న ఎంజేపీ సిబ్బంది

వేసవి దృష్ట్యా ఉపాధి హామీ కూలీల రక్షణకు చర్యలు



ఉపాధి హామీ పనులు, కూలీల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

వేసవికాలం దృష్ట్యా పని ప్రదేశాలలో ఉపాధి హామీ కూలీల రక్షణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం ఎల్లారం శివారులో గల వ్యవసాయ చేనులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో కొనసాగుతున్న పనులలో ఉపాధి హామీ కూలీల రక్షణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉపాధి హామీ ప్రాంతాలలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎండ తీవ్రత దృష్ట్యా నీడ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు జాబ్ కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, ఆదిశగా అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారాం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీలోని ప్రతి మొక్కను సంరక్షించాలి

జిల్లాలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీలలో సిద్ధం చేయాలని, ప్రతి మొక్కను సంరక్షించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆకస్మికంగా సందర్శించి మొక్కల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలలో పెరుగుతున్న ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. మొక్కల రక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ రక్షించాలని సూచించారు. పంచాయితీ, గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గ్రామపంచాయతీ కార్యదర్శి కవితకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ బానోత్ దత్తారాం, ఎంపీడీఓ శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ జీఓలను సవరించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీఓలను సవరించి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట క్యాంపెయిన్ గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించి డిమాండ్‌లతో పరిష్కంచాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాల నిర్ణయం అశాస్త్రీయంగా చేశారన్నారు. పాత వీడీఏను ప్రస్తుతం పొందుతున్న వేతనంలో కలిపారే తప్ప కొత్త డ్రాఫ్ట్ జీఓలలో నయా పైసా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేండ్లకు ఒకసారి సవరించాల్సిన జీఓలను 12 నుంచి 18 ఏండ్లు గడుస్తున్నా సవరించడం లేదన్నారు. గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ రెండూ కూడా పారిశ్రామిక యజమానులకు లాభాలు పెంచడం కోసం మాత్రమే కార్మికుల వేతనాలు పెంచలేదని ఆరోపించారు. యజమానులకు వేల కోట్ల లాభాలు ఆర్జించే విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాల్సిన తరుణంలో జీఓల సవరణ పేరుతో తగ్గించి కాంగ్రెస్ తన వర్గ నైజాన్ని చాటుకుందన్నారు. తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఇందులో కార్మికులు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ సంబరాలు



నవతెలగాణ- బెజ్జూర్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలుపొందడంతో మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో బాణసంచాలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోంద్ర మనోహర్ గౌడ్, పార్టీ నాయకులు జాడి దిగంబర్, బాలకృష్ణ, లింగాల శంకరయ్య, రాకేష్, రాజారామ్, పద్మాకర్ పాల్గొన్నారు.

రెబ్బెన : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో రెండు స్థానాలు గెలుచుకొని ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని కొమరవెల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చేపురి నవీన్ గౌడ్, బూత్ అధ్యక్షులు ముంజం అఖిల్, నాయకులు వడ్లాల దుర్గాప్రసాద్, నరసింహ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దహెగాం : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయవం సాధించడంతో బీజేపీ నాయకులు మండలకేంద్రంలోని అంగడి బజారులో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాపర్తి ధనంజయ, నాయకులు కోంద్ర ప్రభాకర్ గౌడ్, లగ్గామ దామోదర్, దండెర శంకర్, రౌతు రాజన్న, గౌరె లక్ష్మాజీ, దందేరా రాజు, జునగారి లచ్చన్న, చప్పిల వెంకన్న, ఇస్లాత్ గోపాల్, రాకేష్, దెబ్బడ సత్యం, దందేరా మహేష్, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



శ్రామినేర్‌కు హాజరైన బౌద్ధ బిక్కు సంఘం భీక్షు బౌద్ధ గురు భాదంతే బంతే ధమ్మ సారది, పాత్రికేయులు

నవతెలంగాణ-వాంకిడి

బుద్ధుడి శాంతి మార్గాన్ని, అంబేద్కర్ క్రాంతి మార్గాన్ని ప్రజల్లోకి వెళ్లినప్పుడే జ్ఞానవంత సమాజం ఏర్పడుతుందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యుజె) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహిమాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో బౌద్ధ దమ్మ దీక్ష శ్రామినేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ శాంతి మార్గంతో మనుషులంతా సమానమని బుద్ధుడు ప్రబోధిస్తే భారత రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ దేశ ప్రజలకు సుఖమయమైన జీవితాన్ని అందించారన్నారు. నాగ్‌పూర్ పట్టణానికి చెందిన భారతీయ బౌద్ధ బిక్కు సంఘం భీక్షు బౌద్ధ గురు భాదంతే బంతే ధమ్మ సారది నేతృత్వంలో కొనసాగుతున్న శామినేర్‌లో వారం రోజుల పాటు బుద్ధుడు సమాజానికి చూపిన శాంతి మార్గం, జీవన శైలి నేటి సమాజానికి కూడా అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదేవిధంగా అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా అందించిన స్ఫూర్తిని ప్రజలోట్ల చైతన్యం కల్పించాలని కోరారు. అంతకుముందు భారతీయ బిక్కు సంఘ్ ప్రధాన కార్యదర్శి ధమ్మ సారది, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ దీక్షలో కూర్చున్న శామినేర్లకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బంతే రాహుల్ బోధి, బంతే నిన్నాన్, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జి శ్రామినేర్ ధమ్మ దీప్, బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు జయరాం, అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, సమాజ అధ్యక్షుడు మహాత్మా రాజేంద్రప్రసాద్, నాయకులు రోషన్, అరుణ్, బౌద్ధ ఉపకులు, అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గిరిజన క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. 9 అంశాలలో పోటీలను నిర్వహించగా ప్రతిభ కనబరిచిన బాలురు ఈనెల 10న ఉట్నూరులో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు, ఈనెల 12 బాలికలకు ఆసిఫాబాద్‌లో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అదే విధంగా 20 మంది క్రీడాకారులను ఈనెల 19న హైదరాబాద్‌లోని బోయినపల్లిలో ఉన్న వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఎంపిక పోటీలకు పంపిస్తామని గిరిజన క్రీడా అధికారి బండ మీనారెడ్డి తెలిపారు. కాగా ఈ పోటీలను డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఈ పాఠశాల నుంచి 25 క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పాఠశాల ప్రారంభించినప్పటి నుంచి దాదాపు 140 రాష్ట్ర జాతీయ స్థాయికి క్రీడలో పాల్గొన్నారని వివరించారు. కాగా నాలుగో తరగతి చదువుతున్న గిరిజన క్రీడాకారులు 105 మంది బాలికలు, 64 మంది బాలురు, 28 మంది పీఈటీ, పీడీలు, 30 మంది పోషకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ చిరంజీవి, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, మనోహర్, పేట సెక్రెటరీ కృష్ణమూర్తి, కోచ్‌లు విద్యసాగర్, అరవింద్, తిరుమల్, వ్యాయామ ఉపాధ్యాయులు బిక్కు, షేకు, వనిత, కనక వెంకటేష్, రాజేందర్ ప్రసాద్, సుందర్ సింగ్, అరవింద్, మంగవతి పాల్గొన్నారు.



తాగునీరు అందించాలని గ్రామస్తుల నిరసన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇనోలి గ్రామంలో తాగునీటి సమస్యపై బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘం నాయకులు గ్రామస్తులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. దీంతో కలెక్టర్ స్పందించారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ తెలిపారు. బుధవారం చేపట్టిన నిరసనకు జిల్లా అధికారులు స్పందించి గురువారం ఇనోలి గ్రామానికి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించారని ఆయన తెలిపారు.

నూతన అద్దె భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్‌లో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గుండిరోడ్డులోని ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో గల నూతన అద్దె భవనంలోకి మార్చినట్లు సబ్ రిజిస్ట్రార్ ఎస్.అప్పారావు తెలిపారు. ఇది వరకు కుమురంభీం చౌక్‌లో గల అద్దె భవనం శిథిలావస్థకు చేరడం, గదులు సరిపోక పోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇతర భవనంలోకి మార్చడం జరిగిందన్నారు. ప్రజలు ఈ మార్పును గ్రహించాలన్నారు.

రేపు మున్నూరుకాపు మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలం మున్నూరు కాపు మండల నూతన కార్యవర్గాన్ని 8న ఎన్నుకోవడం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మిట్ట వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం స్థలంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని, ఈ ఎన్నికలకు మండలంలోని మున్నూరు కాపు కులస్థుల అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆకతాయిల ఆటకట్టిన షీటీం

నవతెలంగాణ-మంచిర్యాల



బైక్‌ల పై తిరుగుతూ వికత చేష్టలకు పాల్పడిన ఆకతాయిల ఆట కట్టించారు జిల్లా షీ టీం పోలీసులు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల ప్రకారం ఆపరేషన్ డెకాయ్ కార్యక్రమంలో భాగంగా ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద షీటీం ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై హేమ తెలిపారు. గురువారం పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షలు రాసేందుకు వచ్చి అమ్మాయిల చుట్టూ తిరుగుతూ వాళ్లను ఇబ్బందులకు గురి చేసిన పలువురు యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇలాంటి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు. ఆమె వెంట సిబ్బంది జ్యోతి, సతీష్ పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-మంచిర్యాల



మానసిక సమస్యలతో మనస్థాపం చెందిన వివాహిత ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచిర్యాలలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని గోపాల్‌వాడకు చెందిన కానవేని రాజమణి(35) కొద్దీ రోజులుగా మానసికంగా బాధపడుతుంది. కుటుంబ సభ్యులు పలు సార్లు ధైర్యం చెప్పిన ఆమె మానసిక స్థితి మెరుగుపడలేదు. ఇదే క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతురాలికి భర్త సతీష్, పిల్లలు సాయి కీర్తన, సాయి వినయ్ ఉన్నారు. మృతురాలి సోదరుడు రఘువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేవీలో మెరుగైన ఫలితాలకు కృషి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-హాజీపూర్

కేంద్రీయ విద్యాలయంలో వార్షిక పరీక్షలల్లో మెరుగైన ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయ భవనం పనులను సందర్శించి పనుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం ద్వారా మెరుగైన విద్య అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్రీయ విద్యాలయానికి సొంత భవనాన్ని కేటాయించి మరింత మెరుగైన సదుపాయాలతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యార్థులు క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వీరిని మరింత ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండేతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. వివిధ రకాల భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, ధృవపత్రాలకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్దిత గడువులోగా జారీ చేయాలన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీఓలను సవరించి కనీస వేతనం రూ 26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతన డ్రాఫ్ట్ జీఓలను విడుదల చేసిందని, వేతనాల నిర్ణయం అశాస్త్రీయంగా చేశారన్నారు. పాత వీడీఏను ప్రస్తుతం పొందుతున్న వేతనంలో కలిపారే తప్ప కొత్త డ్రాఫ్ట్ జీఓలలో నయా పైసా పెంచలేదని విమర్శించారు. ఈ మేరకు 2025 మార్చి 1 నుండి 7 వరకు క్యాంపెయిన్ చేయడం జరిగిందని, ఈ సందర్భంగా జిల్లాలో బీడీ కార్మికులు వివిధ మండలాల్లో సుమారు 3000 మంది కార్మికులున్నారని, విరికి పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనం లేదని మండిపడ్డారు. అదే విధంగా జిల్లాలో సింగరేణిలో 7000 మంది కాంట్రాక్టర్ కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని, వీరికి కోల్ ఇండియా అగ్రిమెంట్ ప్రకారం హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయడం లేదని, సింగరేణి యాజమాన్యం పంపిన లేఖ ప్రకారంగా జీఓ నెంబర్ 22న సింగరేణిలో అమలు చేసుకోవడానికి అనుమతులు కూడా ఇవ్వడం లేదన్నారు. సింగరేణి, రైల్వే, జైపూర్ విద్యుత్ ప్లాంట్ ఉత్పత్తి రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. జిల్లాలో ప్రధానంగా ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్, హోటళ్లు, రెస్టారెంట్లు, రైస్, జిన్నింగ్ మిల్లులు, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్, బ్రేడ్, కార, సిమెంటు ఉత్పత్తి పరిశ్రమలు, టైల్స్ ఉత్పత్తి కేంద్రాలు, ఇటుక బట్టీలు, సంఘటిత రంగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, డైలీ వైజ్ కార్మికులందరూ కనీస వేతనం లేక, కుటుంబాన్ని పోషించుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా మినిమం ఫ్లోర్ లెవల్ వేజ్ రోజుకు రూ.178లుగా నిర్ణయించిందని, నెలకు రూ.4,628లతో బ్రతకాలని బీజేపీ ప్రభుత్వం చెబుతుందన్నారు. ఇది ఎలా సాధ్యపడుతుందని, కార్మికుల వేతనాల పట్ల కాంగ్రెస్, బీజేపీకి పెద్ద తేడా కనపడట్లేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, కార్మికుల వేతనాలు, సంక్షేమం, కార్మిక చట్టాలపై తీవ్రమైన దాడి చేస్తుందని, పది సంవత్సరాలుగా సీఐటీయూ నిరంతరం కనీసం వేతనాల జీఓల సవరణ, సమస్యల సాధనకు పోరాటం చేస్తుందని, 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం బ్రాంచ్ అధ్యక్షులు మహేందర్, బీడి కార్మికులు రాజన్న, రజిత, స్వరూప, రాజ్యలక్ష్మి, శిరీష, శ్రీలత, మానస, రజిత పాల్గొన్నారు.

ఇసుక రవాణ అక్రమార్కులపై కేసు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కిష్టాపూర్ నుండి గోదావరి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపారు. కిష్టాపూర్ గ్రామానికి చెందిన జిమ్మిడి నాగరాజు గోదావరినది ఇసుకను అక్రమంగా నిల్వ చేసి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. గోదావరి ఇసుక అక్రమంగా నిల్వ చేసి అత్యధిక ధరతో అక్రమ మార్గంలో అమ్ముతున్నట్లు సమాచారం మేరకు ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించిన లారీ నెం. టీఎస్19టీఏ 7786తో పాటు ఇసుక తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీ నెం. టీఎస్02ఈక్యూ7463 సీజ్ చేశామన్నారు. షెట్‌పల్లి గ్రామానికి చెందిన ధర్మాజీ సంతోష్ జేసీబీ సహాయంతో ఇందారం గ్రామానికి చెందిన సాధీక్ (టిప్పర్) లారీ ద్వార కిష్టాపూర్‌కు చెందిన జిమ్మిడి నాగరాజు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా జిమ్మిడి నాగరాజు, సయ్యద్ గౌస్ కరీంఉల్లా, మహమ్మద్ రియాజ్, దర్మాజీ సంతోష్, గాండ్ల మల్లయ్య మహమ్మద్ సాదీక్‌లు నిందితులుగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు రెస్ట్ షెల్టర్లను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

వేసవి కాల దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతల కారణంగా సింగరేణి వ్యాప్తంగా ఉపరితల గనులలో, సీహెచ్‌పీలలో పనిచేసే ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు రెండవ బదిలీ పని వేళలు కుదించాలని, రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదేవిధంగా చల్లటి మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ అందించాలని పేర్కొన్నారు. సింగరేణి వ్యాప్తంగా సెక్యూరిటీ సిబ్బందికి వాసి పోస్టింగ్ వద్ద షెల్టర్లను, మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్ శివారు ఎల్లంపల్లి ప్రాజెక్టు కమాన్ వద్ద నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గుడిపేట్ గ్రామానికి చెందిన ముదిరాజుల ఆధ్వర్యంలో దాతల సహాయంతో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణం చేపట్టారు. బుధవారం నుండి ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా విగ్రహాన్ని గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి వేదమంత్రాలతో ప్రతిష్ఠించారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



కేజీబీవీలో వంట మనిషితో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

జిల్లాలో ఈ నెల 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీను మండల తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి సందర్శించి వంటశాల, భోజనశాల, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, శౌచాలయాలు, ప్రహరీగోడ ఇతర మౌళిక సదుపాయాలు కల్పించడంతో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మున్సిపాలిటీలో ఆస్తి పన్నులను 100 శాతం వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్విజ్‌తో పోటీతత్వం అలవడుతుంది



నవతెలంగాణ-లక్షెట్టిపేట

క్విజ్, ఇతరత పోటీల నిర్వహణతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. మండలంలోని జెండా వెంకటాపూర్ కాంప్లెక్స్ పరిధిలో గురువారం ప్రాథమిక పాఠశాల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులతో పోటీతత్వం పెరుగుతుందన్నారు. పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చి ఉపాధ్యాయిలు భోదించే పాఠాలు చక్కగా అవగాహన చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు యశోధర, కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌పీ ప్రణీత్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య విజయం సాధించడాన్ని హర్షిస్తూ ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుకున్నారు. అంబేద్కర్, తెలంగాణ తల్లి, మరియు చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టపాసులు పేల్చి మిఠాయిలు తినిపించి విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాలరావు, మండల అధ్యక్షులు నాగిరెడ్డి హేమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు 40 శాతం తగ్గింపు



కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల ద్వారా అందిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు 40 శాతం తగ్గింపుతో ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించడం జరుగుతుందని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీల వారీగా ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్న వారికి మార్కెట్ విలువల నుండి 25 శాతం తగ్గించి నేరుగా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుదని తెలిపారు. అదేవిధంగా సబ్ రిజిస్టార్ కార్యాలయంలో దరఖాస్తుదారుడు మరో 15 శాతం తగ్గింపుతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మొత్తంగా ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుదారులు 40 శాతం తగ్గింపుతో నేరుగా తమ ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. కాగా ఎల్ఆర్ఎస్ ఇంటి స్థలాలకు సంబందించిన వివరాలు నేరుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి లాగిన్ నుండి సబ్ రిజిస్టార్ లాగిన్‌లోకి వెలుతాయని తెలిపారు. కాగా విషయాన్ని గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా ప్రచారం చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కాగా ఇందిరమ్మ ఇండ్లకు సంబందించిన మొదటి ప్రాధాన్యత లిస్టును తీక్షణంగా పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని, అదేవిధంగా రెండవ ప్రాధాన్యతా లిస్టును ప్రస్తుతానికి పక్కన పెట్టాలని 3వ ప్రాధాన్యతా లిస్టులో అర్హులైన వారు ఉంటే వారికి మొదటి ప్రాధాన్యతా లిస్టులో చేర్చాలని తెలిపారు. అదేవిధంగా ఇంటి పన్ను వసూళ్ల ఈ నెల 15 లోపు వంద శాతం పూర్తి చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వాహణపై శ్రద్ధ వహించాలని తెలిపిన ఆయన మొక్కలకు నీళ్లు పోస్తున్న వారి పేమెంట్ గ్రామ పంచాయతీలకు ఇవ్వాలని, పేమెంట్లు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. వేసవి ఎండలు ముదురుతున్నందున నర్సరీ మొక్కలకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు నిరంతరాయంగా కొనసాగించాలన్నారు. డీఎస్ఆర్ ప్రతి రోజు ఉదయం 8 గంటలలోపు నమోదు చేయాలని, ఎస్‌బీఎం పెండింగ్ బిల్లులు రెండు రోజుల్లో క్లీయర్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ బాలయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెట్లు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో గురువారం మూఢనమ్మకాలపై ప్రముఖ మెజీషియన్ మహ్మద్ ఇస్మాయిల్ మ్యాజిక్ షో నిర్వహించారు. మాయలు, మంత్రాలు, దయ్యాలు, భూతాలు లేవని, మోసం చేయడానికి వచ్చే వారిని నమ్మవద్దని విద్యార్థులకు మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా డబ్బాలో నుంచి జాతీయ పతాకం తీయడం, బ్లేడ్‌లను మింగడం, గుడ్డు మాయం చేయడం, డబ్బులు మాయం చేయడం ఎలాగో టెక్నిక్‌తో చేసి చూపించాడు. ఇందులో పాఠశాల హెచ్ఎం సతీశ్‌గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి పాల్గొన్నారు.

నేటి నుంచి కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో ఒకటవ తరగతి అడ్మిషన్‌లకు నేటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. 1 ఏప్రిల్ 2025 నాటికి 6 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేవీఎస్‌ఆన్‌లైన్‌అడ్మిషన్.కేవీకే.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చ్ 21 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అడ్మిషన్ పొందిన వారి వివరాలు మార్చ్ 25న ప్రకటిస్తామన్నారు.

రాఘువేంద్ర స్వామికి పూజలు చేసిన భక్తులు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని మేదరి వాడలో ఉన్న హనుమాన్ దేవాలయంలో సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి వారికి భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి వారి జన్మదినోత్సవం సందర్భంగా గురువారం హనుమాన్ దేవాలయంలో రాఘవేంద్ర స్వామి వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసినంతరం హోమాలు యాగ్నాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, జక్కు సత్తయ్య, బీజేపీ నాయకులు గోలి చందు, భక్తులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

కళాశాల విద్యా కమిషనర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పరిశోధన విలువలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు, గణితం విభాగాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొన్నారు. తెలుగు ప్రాజెక్ట్‌కి అధ్యాపకుడు డా.తన్నీరు సురేష్, గణిత ప్రాజెక్ట్‌కు అధ్యాపకురాలు స్వప్న సూపర్‌వైజర్లుగా వ్యవహరించగా విద్యార్థులు శైలజ, విజయ్, తిరుపతమ్మ, లక్ష్మి, శ్రీనివాస, సాయి, వర్షిణి, రజని, లక్ష్మి, శ్రీనాథ్‌లు గణితం ప్రాజెక్టులను ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదారాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం తెలుగు, గురువారం గణితం పోటీలు జరిగాయి. ఆధునిక సమాజం, మానవ జీవితం, పరిశోధనలో వస్తున్న మార్పులను, పీపీటీ, మోడల్స్ ద్వారా యూనివర్సిటీ నుండి వచ్చిన సెలక్షన్ కమిటీకి వివరించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ డైరెక్టర్ యాదగిరి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొని సర్టిఫికెట్లు ప్రధానం చేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.సంతోష్ మహాత్మా, జిజ్ఞాస కో ఆర్డినేటర్ జాడి శంకరయ్య, సూపర్‌వైజర్లు డా.తన్నీరు సురేష్, స్వప్న, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



పరీక్షకు 8 మంది గైర్హాజరు

నవతెలంగాణ-జన్నారం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 8 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 126 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 118 మంది హాజరయ్యారన్నారు. కరిమల కళాశాలలో 145 మందికి 145మంది పరీక్షలు రాసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఎస్సై రాజవర్ధన్, తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
శుక్రవారం | మార్చి 07, 2025 | www.navatelangana.com

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-నేరడిగొండ



ఆత్మహత్య చేసుకుని రైతు మతి చెందిన సంఘటన గురువారం మండలంలోని వదూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం వడూర్‌కు చెందిన ఈదపు పోశెట్టి (60) తన ఇద్దరు కూతుళ్ల పెండ్లి చేయడానికి దాదాపు రూ.20 లక్షల అప్పు చేశాడు. పంటలు సరిగా పండక అప్పు ఎలా తీర్చాలో తెలియక పురుగుల మందు సేవించి ఇంట్లో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పారిశ్రామికవేత్త జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల సురేందర్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఏఎన్‌రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో గురువారం పాకాల ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రామచందర్ కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సన్మానించారు. ఇందులో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ కోఆప్షన్ సభ్యులు లింగారెడ్డి, జహీరుద్దీన్, భూమన్న పాల్గొన్నారు.



పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటు అధికారులు, సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో ప్రధాన బాధ్యత వహించాలని చీఫ్ సూపరింటెండెంటు ఆదేశించారు. 10106 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా వారి మొత్తం 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఇందులో రెగ్యులర్‌లో 5058 మంది బాలురు, 4993 బాలికలు, ప్రైవేటుగా 32 మంది బాలురు, బాలికలు 23 మంది ఉన్నారన్నారు. కేంద్రాల వద్ద అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆశా వర్కర్ ఏఎన్ఎంలను, సిబ్బంది అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష సమయాలను దష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సరైన సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్టు తెలపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు చూడాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో మహిళా కానిస్టేబుల్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, సమన్వయంతో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రశ్న పత్రాలను భద్రపరిచేందుకు 14 కేంద్రాలలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

నిర్మల్ : పదవ తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిందని, ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. నిరంతరం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, విద్యార్థుల అనుమానాలను నివత్తి చేయాలన్నారు. పరీక్షల కోసం సన్నద్ధానికి ప్రత్యేకంగా సమయసారిణి రూపొందించాలన్నారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని తెలిపారు. పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెళకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రామారావు, ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్

బుద్ధవిహార్ పాలనను బుద్ధిస్టులకు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీహార్‌లో బుద్ధగాయ బుద్ధవీహార్ పాలనను బుద్ధిస్టులకు ఇవ్వాలని భారతీయ బౌద్ధ మహాసభరాష్ట్ర నాయకులు రత్నజాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. గత 20 రోజులుగా బౌద్ధ గాయ మహాబోధి, బుద్ధవీహార్ ముక్తి కోసం బౌద్ధ బిక్షులు నిరసన చేస్తున్నారు. వారికి మద్దతుగా గురువారం అంబేద్కర్‌చౌక్ నుంచి భారతీయ బౌద్ధ, బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బుద్ధవీహార్ బుద్ధిస్టులకు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాకుమార్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు జ్ఞానం పొందిన బీహార్‌లోని గాయ బౌద్ధ విహార్‌ను ఇతర మతస్తుల ఆధీనంలో ఉందన్నారు. ఇతర మతాల్లో మందిరాలు, పవిత్ర స్థలాలు వారి ఆధీనంలో ఉంటాయని, కానీ గాయలో మాత్రం వేరే విధంగా ఉందన్నారు. అక్కడ బ్రహ్మణ వ్యవస్థనే జరుగుతుందన్నారు. బుద్ధిస్టులకు స్వేచ్ఛ ఇచ్చేలా గాయ బౌద్ధ విహార్ బుద్ధిస్టులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దంతాలను కాపాడుకోవడానికి నిత్యం బ్రష్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దంతాలను కాపాడుకోవడానికి నిత్యం బ్రష్ చేయాలని డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరాం అన్నారు. గురువారం రిజర్వ్ పోలీస్ లైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దంతాలు చెడిపోకుండా చేపట్టాల్సిన అంశాలను తెలియజేశారు. నిత్యం బ్రష్ చేయాలని వివరించారు. అనంతరం పలువురికి దంతపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు బ్రష్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ చిన్నతనం నుంచే దంతాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దంత, చిగుళ్ల సమస్యలు వస్తాయన్నారు. రాత్రి భోజనం చేసిన తరువాత బ్రష్ చేయాలని సూచించారు. ఉదయం, రాత్రి రోజు రెండు సార్లు బ్రష్ చేస్తే పళ్ల మధ్యలో ఇరుకున్న భోజనం, తిండి వస్తువులు బయటకు వెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నీలదేవి, స్కూల్ ఇన్‌చార్జి సంజయ్ దేశ్‌పాండే, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిన్మయ్ వర్ఘే, సంజీవ్ కుమార్, నంద్, రవీందర్‌రెడ్డి, సచిన్‌రెడ్డి, దీపిక, భవన, రాధిక ఉన్నారు.

నర్సరీలో మహిళలకు ఆటల పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో సెంట్రల్ నర్సరీలో గురువారం మహిళలకు బాంబ్ బ్లాస్ట్, టగ్‌ఆఫ్‌వార్, త్రో బాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి ముఖ్యాథితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మహిళలు ఉత్సాహంగా ఈ వేడుకలలో పాల్గొనడం అభినందనీమన్నారు. విజేతలకు 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. ఇందులో ఇంచార్జ్ ఎస్ఓ టు జీఎం శ్రీధర్ రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, డీవై పీఎం రాజేశ్వర్ రావు, సీనియర్ పీఓ రణదీప్ గౌడ్, ప్రబంధిత పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ-జైనూర్

మండల పోలీసుల ఆధ్వర్యంలో ప్రతిమ సంచార ఆరోగ్య రథం ద్వారా శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న క్రికెట్ మైదానంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో బీసీ షుగర్ (మధుమేహం) గుండె సంబంధిత వ్యాధులు వివిధ రకాల క్యాన్సర్లు, పక్షవాతం, ఛాతి, దమ్ము దగ్గు ఊపిరితిత్తుల వ్యాధులు, అన్నిరకాల గడ్డలు, వరిబీజం తదితర వాటికి ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా థైరాయిడ్ (గొంతుపై గడ్డలు) రొమ్ములో గడ్డలు దీర్ఘకాలిక పుండ్లు కాలి మీద రింగులు చుట్టుకొని ఉన్న నరాలు కడుపులో గడ్డలు శరీరంపై కంతులు బీజం కుట్టు (హెర్నియ) వ్యాధులకు ఉచిత కన్సల్టేషన్, పరీక్షలు, చికిత్స, ఆపరేషన్ అవసరమైనవారిని కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రికి రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల, పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం



నవతెలంగాణ-కుభీర్

గ్రామ పంచాయతిలో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ఇష్టనురీతిలో వ్యవహరించిన పల్సి గ్రామ పంచాయతీ కార్యదర్శి పై మండల పంచాయతీ అధికారి మోహన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన గ్రామ పంచాయతీని సందర్శించగా గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త చెదారం, మురికి కాలువల్లో మురికి నీరు పేరుకుపోవడ ఆగ్రహం వ్యక్తం చేశారు. షేగ్రీగేషన్ షెడ్, శానిటేషన్, నర్సరీలను పరిశీలించి పనులపై అసంతప్తి వ్యక్తం చేశారు. రెండు రోజులో పరిస్థితి చక్కదిద్దకుంటే కఠిన చర్యలు తప్పవని కార్యదర్శికి సూచించారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దటి లేకుండాచ చర్యలు చేపట్టాలని, 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పాండురంగ్ సింగ్, సిబ్బంది ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

నవతెలంగాణ-ఉట్నూర్

అదుపుతప్పి కింద పడి అపస్మారక స్థితిలోకి జరుకున్న వ్యక్తికి సకాలంలో వైద్యం అందించి ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఉపేందర్ మానవత్వం చాటుకున్నారు. గురువారం మండలంలోని బొప్పరికుంట గ్రామానికి చెందిన లక్ష్మణ్ కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆ సమయంలో అదే మార్గంలో ఉట్నూర్ ఆస్పత్రికి వస్తున్న డాక్టర్ ఉపేందర్ అతన్ని గమనించి తన కారులో ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందించాడు. ప్రథమ చికిత్స అందించడంతోనే ఆయన స్పహలోకి వచ్చాడు. ప్రస్తుతం అదని ఆరోగ్యం నిలకడగా ఉంది. సకాలంలో చికిత్స అందించిన ప్రాణాలు నిలబెట్టిన వైద్యుడిని పలువురు అభినందించారు.



బీజేపీ శ్రేణుల విజయోత్సవ సంబరాలు



నవతెలంగాణ-భైంసా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడంతో పార్టీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ శ్రేణులు స్థానికంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, మహాగాం మాజీ సర్పంచ్ రాకేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు లోమాజీ, నర్సారెడ్డి, గంగాధర్, ప్రతాప్‌సింగ్, బాలాజీ పటేల్, నాగన్న, దేవిదాస్, యోగేష్, శంకర్, గంగాప్రసాద్, శ్రీనివాస్, అనిల్ పటేల్, బండుపటేల్, లింగన్న, భోజరాం పటేల్, రామకష్ణ, దిగంబర్, పోతన్న, మల్లేష్, గంగాధర్, మహేందర్, సంతోష్, పిరాజీ, గులాబ్, పాల్గొన్నారు.

కాసిపేట : టీచరు ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్మలై అంజిరెడ్డి నేపథ్యంలో మండల కేంద్రంలో ముత్యంపల్లి బైపాస్ రోడ్ బీజేపీ మండల అధ్యక్షుడు సూరంసంపత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేశారు. టపాసులు పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేవునూరి సంతోష్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి, రెడ్డిబాలరాజు, నాయకులు బాకీ కిరణ్, పెద్దపెల్లి శంకర్, దోమల రామచందర్, బీజేవైఎం నాయకులు మెస్రం తిరుపతి, చొప్పదండి విష్ణువర్ధన్, ఎస్సీ మోర్చ నాయకులు రామటెంకి వినయ్ కుమార్, ఎస్టీ మోర్చా నాయకులు సంపత్ నాయక్ పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడంతో గురువారం సోన్, నర్సాపూర్(జి), దిలావర్పూర్, నిర్మల్ మండలల్లో బీజేపీ నాయకుల, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఇందులో ఆ పార్టీ నాయకులు రావుల రాంనాథ్, రాచకొండ సాగర్, మండల ప్రెసిడెంట్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ మద్దతుదారు మల్కా కొమురయ్య గెలుపు పట్ల ఆ పార్టీ శ్రేణులు మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ చౌరస్తా వద్ద గురువారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మేధావులైన ఉపాధ్యాయుల తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టని మండల అధ్యక్షులు డోకే లక్ష్మణ్ పేర్కొన్నారు. ఇందులో ఆ పార్టీ నాయకులు మల్లయ్య తుకారాం, మురళీ, మోహన్, పురుషోత్తం చారి, భీమేష్, రంగయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ పై నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రంబుల్ స్ట్రైప్స్, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ లేజర్ గన్ ఏర్పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. అవసమైన ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ధనోరా (బి), ఏమయికుంట, పులిమడుగు, పెర్కగూడా, షాంపూర్, పొన్నారి, కుచులాపూర్, హస్నాపూర్(కొడద్), ఆదిలాబాద్ పట్టణంలో కలెక్టర్ చౌక్, గర్ల్స్ హై స్కూల్, రిమ్స్, ఆర్టీసీ బస్టాండ్, రామాయి, చందా, రాంనగర్ హనుమాన్ టెంపుల్, మావల బస్టాండ్, తిరుమల పెట్రోల్ పంప్, తదితర ప్రాంతాలను పర్యవేక్షించి ప్రతిపాదనలు పంపించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలికి సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యురాలుగా ఇటీవలే ఎంపికైన ప్రియదర్శిని నగర్ ఎన్టీఆర్ మార్గ్ కాలనీకి చెందిన శ్రీమతి ఆడేపు లలితాశ్రీని గురువారం ఎన్టీఆర్ మార్గ్ సొసైటీ కాలనీ సభ్యులు వారి నివాసంలో ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలుగా కాలనీకి చెందిన మహిళ ఎంపిక కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను శాలువాతో సన్మానించి మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు ఆడెపు సుధాకర్, కమిటీ అధ్యక్షులు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి శివరాం, వెంకటేష్, చిటిమల్ల సదయ్య, మధుకర్ పంపాట్‌వార్, వొటారికారి విద్యాసాగర్, గన్నేరు ప్రభు, మహాజన్ సతీష్, గొండ శంకర్, కందూరి కిష్టయ్య, కందూరి శంకర్, రాజారపు లింగన్న, సంఘం మహేందర్, జొన్న సునీల్, కూన చరణ్, వసంత్ పటేల్, రాకేష్, జెట్టి నరేందర్, శిల్ప సంతోష్, గాదే వివేకానంద, నడికట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ విజిలెన్స్ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. ఇటీవల కొంత మంది మీటర్లు తిరగకుండా చేస్తామని చెప్తూ వినియోగదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఇలాంటి వారి మాయమాటలు నమ్మవద్దని, ఇలాంటి వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే తమకు, పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.